బ్రహ్మవిద్యను గూర్చి బహుళ ప్రచారము
సలుపువారు కలరు చాలమంది
కాని ఆచరించు ఘనుడు ఒక్కడు లేడు
సత్యమైన బాట యీ సాయి మాట.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

సృష్టిక్రమమును పురస్కరించుకొని మానవునకు బ్రహ్మకు వుండిన సన్నిహిత సంబంధ బాంధవ్యమును అర్థం చేసుకున్నప్పుడే దివ్యమైన బ్రహ్మవిద్య మనకు లభ్యమవుతుంది. బ్రహ్మ అనగా అనంతమైన తత్త్వమే. ఇట్టి అనంత తత్త్వమునుండి ఆకాశము ఆవిర్భవించింది. ఆకాశమునుండి వాయువు, వాయువునుండి తేజస్సు, తేజస్సునుండి నీరు నీటినుండి పృథ్వి, పృథ్వినుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము అన్నమునుండి పురుషుడు. ఈ పురుషునకు బ్రహ్మను వుండిన సన్నిహిత సంబంధ బాంధవ్యమును యీ క్రమమును పురస్కరించుకొని విచారించినప్పుడు కేవలము పురుషుడు అనంతమైన శక్తినుండియే ఆవిర్భవించాడనే సత్యము అర్థమవుతుంది. బ్రహ్మానందమనే పదమునందు బ్రహ్మ ఆనందము రెండు పదములు చేరుతూ వచ్చాయి. బ్రహ్మానందమనేది ఒక్క పదము కాదు. సమాసము బ్రహ్మ వేరు ఆనందము వేరు. ఈ రెండు పదములు విభజించినప్పుడు మనకు ప్రత్యేకముగా గోచరిస్తాయి. మానవుడు అన్నమునుండి ఆనందము వరకు ప్రయాణము సలుపుతూ వచ్చాడు. మానవుని యొక్క అభీష్టము ఆనందమే. అదే గమ్యము. ఈ ఆనందమును బ్రహ్మముతో చేర్చినప్పుడే ఇది బ్రహ్మానందమనే స్వరూపాన్ని ధరిస్తుంది. కనుక మానవుడు బ్రహ్మకు మానవత్వమునకు అవినాభావ సంబంధమున్నదని చక్కగా అర్థము చేసుకొనుటకు సాధ్యమౌతుంది. ఇట్టి బ్రహ్మవిద్య అనేది కేవలము బ్రహ్మము ద్వారానే లభ్యమవుతుంది. ఐతే మానవుడు లౌకికమైన జగత్తులో కట్టుబడటం చేత యీ బ్రహ్మతత్వాన్ని విస్మరించి జగత్ తత్వాన్ని విశ్వసించి తాను యీ బ్రహ్మతత్వమునే గుర్తించుకోలేక పోతున్నాడు. సామాన్యమైన మానవుడు రాగ, భయ, క్రోధములతో కూడటం చేత యీ విధమైన బ్రహ్మానందమునకు అత్యంత దూరమౌతున్నాడు. రాగభయక్రోధములనేవి మనము త్యజించుట చేత యీ బ్రహ్మానందమును కొంతవరకు అర్థం చేసుకోగలము. వీటిని త్యజించి

నంత మాత్రమున చాలదు. భగవత్ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. భగవత్ప్రేమను అభివృద్ధి పరచుకున్నంత మాత్రమున చాలదు. బ్రహ్మప్రేమకు సమర్పుడు కావాలి. సమర్పించినంత మాత్రమున చాలదు. పరిపూర్ణమైన పరతత్త్వముపైన తాను ఆధారపడాలి. అప్పుడే మానవత్వము దివ్యత్వంగా మారటానికి వీలౌతుంది. తైత్తిరీయోపనిషత్తునందు విద్యార్థులకు అధ్యాపకులు బోధించిన యీ శిక్షావలి యొక్క ప్రమాణము, శిక్షావలి యొక్క సారము యీ విధమైన బ్రహ్మానంద ప్రాప్తిని పొందేనిమిత్తమై ప్రబోధిస్తూ వచ్చారు

బ్రహ్మవిద్య అనగా కేవలము మానవాతీతమైన విద్యకాదు. నిత్యజీవితములో సత్యమార్గమును గడిపే వ్యక్తిత్వాన్ని పోషించేటువంటి సహాయమైన సాధనలే. ఇట్టి సాధన సంపత్తిని మానవుడు దినదినాభివృద్ధి చేసుకోవాలి. ఈ బ్రహ్మతత్త్వమునకు మూడు విధములైన రూపములు నిరూపిస్తూ వచ్చింది ఉపనిషత్తు. విరాట్పురుషుడు అని, హిరణ్యగర్భుడు అని, అవ్యాకృతుడు అని యీ మూడు రూపములు కూడను స్థూల సూక్ష్మ కారణములను సంబంధించినటువంటిది. జాగ్రత్ స్వప్న, సుషుప్తిలో చేరినటువంటివి. విరాట్పురుడు అనగా భౌతిక శరీరముతో కేవలము తాను దీర్ఘాయుష్మంతుడుగా వుండి తాను స్థూలమైన స్వరూపాన్ని ధరించి జాగ్రదవస్థా స్వరూపుడైన ఆత్మతత్త్వమే విరాట్ స్వరూపము. ఈ జాగ్రదవస్థా స్వరూపుడైన ఆత్మ తత్త్వమునకే విరాట్ స్వరూపుడని పేరు. ఇతను నామ రూపములను ధరించి నానా నామములతో ప్రకటితమవుతూ వుంటాడు. అనగా చరాచరప్రపంచమంతయు తన యొక్క రూపముగా నిరూపించి ఆకాశాది పంచభూతములను కూడను తన రూపములుగా నిరూపించి పిపీలకాది బ్రహ్మపర్యంతము కూడను తన రూపములుగా నిరూపించి సర్వం విష్ణుస్వరూపమనే స్థితికి తాను రావటం చేతనే అతనికి విరాట్ స్వరూపుడు అన్నారు. అనగా కొండలు గుట్టలు, నదులు, పర్వతములు, సముద్రము, సర్వదృశ్య కల్పితమైన జగత్తంతా విరాట్ స్వరూపమే అది యిది అనే భేదములు లేకుండా ఏది కనిపించునో అదంతా విరాట్ స్వరూపుని అంశములే. కనుక విరాటుడు అనగా బాహ్య జగత్తునకు సంబంధించి స్థూలమైన జగత్ స్వరూపాన్ని ధరించి తాను యీ జగత్తునకు ఆదర్శము నందించేటువంటిదే.

ఇతనికి మరి రెండు పేర్లు వుంటున్నాయి. రెండవది వైశ్వానరుడని. వైశ్వానరుడనగా ప్రతి వ్యక్తి యందు కూడ నేను నేను అనే పదము చేత నిరూపించినవాడు. రాజు మొదలు రైతువరకు, బిచ్చగాని మొదలు శ్రీమంతుని వరకు

631059103

బాలుని మొదలు వృద్ధుని వరకు, స్త్రీ మొదలు పురుషుని వరకు తనను పరిచయము గావించుకునే ప్రతి వ్యక్తి కూడను నేను నేను అనే పదమును వుపయోగ పెడుతున్నాడు. తనను తాను introduce చేసుకునే సమయంలో I, I అని వుపయోగ పెడుతున్నాడు. కాబట్టి నేను అనే పదము సర్వజీవులయందు వుంటున్నది. సర్వజీవులయందు నేను నేను అనే పదమును వుచ్ఛరించువాడే వైశ్వానరుడు. ఇంక మూడవ పేరు. వైరాజసుతుడు. వైరాజసుతుడు, వైశ్వానరుడు, విరాట్పుడు ఈ మూడు ఒక్కరియొక్క వివిధ నామములు. వైరాజసుతుడనగా తాను విచిత్రమైన స్వరూపమును ధరించినవాడు. అందరియందు వుండికూడను తాను లేనట్లుగా అన్ని పనులు చేస్తూ తాను చేయనట్లుగా అన్నింటిని అనుభవిస్తూ తాను అనుభవించనట్లుగా ఈ విధమైన రూపమును ధరించినవాడు కనుకనే ఇతను వైరాజసుతుడని. ఇదియే విరాట్ స్వరూపునియందు మూడు భాగములు ఏర్పడిన అంతరార్థములు.

ఇంక రెండవది హిరణ్యగర్భుడు. హిరణ్యగర్భుడనగా సమస్త జ్ఞానమునకు ఆది. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక ఈ సర్వజ్ఞానములు కూడను హిరణ్యగర్భుని నుండియే ఆవిర్భవించినవి. జ్ఞానభాస్కరుడని కూడను చెప్పవచ్చును. భాస్కరుడు ఉదయించునప్పుడు హిరణ్మయ స్వరూపాన్ని ధరిస్తూ వుంటాడు. ప్రకృతిని కూడను హిరణ్మయముగా మారుస్తాడు కనుకనే ఇతను జ్ఞానభాస్కరుడని చెప్పినప్పుడు హిరణ్యగర్భునకు సరియైన అర్థము వుంటుంది. సమస్త సృష్టి ప్రప్రథమములో హిరణ్యగర్భము నుండియే వచ్చింది. హిరణ్యగర్భుడు అనేది మొట్టమొదట ఒక oval shape. మెన్న చేసిన రీతిగా బంగారు సిద్ధంగా వుంటుంది. ఈ విధమైన ఆకారము నుండి మొట్టమొదట నోరు పుట్టింది. అందుండి శబ్దము ప్రారంభమైంది. తదుపరి నాసికము పుట్టింది. ఇందుండి గాలి ప్రారంభమైంది. తదుపరి కన్నులు పుట్టాయి. ఈ కన్నుల నుండి అగ్ని ప్రారంభమైంది. తరువాత చెవులు పుట్టాయి. దిక్కులన్నియు ప్రారంభమైనాయి. ఈ విధంగా మొట్టమొదట మానవస్వరూపమైన ఆకారమైన జీవితమునకు హిరణ్యగర్భుడు మూలాధారుడు. ఈ హిరణ్యగర్భుని నుండియే సమస్త జీవులు వృద్ధి విస్తూ వచ్చాయి. ఈ సమస్త జీవులకు నిత్యానిత్య విషయ పరిశీలన చేసే విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములు హిరణ్యగర్భుడే ప్రసాదిస్తూ వచ్చాడు. దేనిని పొందవచ్చును. దేనిని పొందకూడదు. దేనిని చేయకూడదు. దేనిని చేయవచ్చు. మానవునికి ప్రధానమైన జ్ఞానము ఏమిటి? మానవత్వమును సార్థకం

గావించే నిజమైన మార్గము ఏమిటి? దానిని సరైన మార్గములో ప్రవేశింప చేయుటానికి మానవులనకు జ్ఞానాన్ని అందిస్తున్నాడు. ఇది హిరణ్యగర్భుని యొక్క ప్రధానమైన క్రియ. హిరణ్యగర్భునకు మరి రెండు పేర్లు వుంటున్నాయి. ఇతనికి మణులలో సూత్రము యే విధంగా ప్రసరిస్తూ వుంటుందో అదేవిధముగా ఇతనికి సూత్రాత్ముడు అని ఒకే పేరు. అనగా ప్రతి మానవుడు అనే మణుల యందు తానొక సూత్ర రూపము ధరించి సర్వులయందు సమత్వంగా ప్రసరించేవాడు. దీనినే బ్రహ్మ సూత్రమని చెప్పుతూ వచ్చారు. భగవంతుడనే సూత్రము మానవులందు సమముగా చేరి వీరు వారు అనే భేదము లేక అందరియందు సమత్వమును చూపే తత్వము హిరణ్యగర్భుని తత్వము. భేద రహితమైన సృష్టిని జగత్తుకు నిరూపిస్తూ వచ్చాడు హిరణ్యగర్భుడు. సూత్రాత్ముడు అని మరొక పేరుగా ప్రకటిస్తూ వచ్చాడు. ఇంక రెండవ పేరు ఏమంటే ప్రాణుడు, హిరణ్యగర్భుడు, సూత్రాత్ముడు ప్రాణుడు అని మూడు పేర్లు. ఇతనికి యీ హిరణ్యగర్భుడు సూక్ష్మాకారమును ధరించి యిది స్వప్నావస్థ యందు ఆత్మస్వరూపమును ధరించినవాడు. కనుకనే హిరణ్యగర్భుడు నిద్రావస్థయందు, స్వప్నావస్థయందు మేలుకొనేవాడు అని అర్థము. జాగ్రదవస్థయందు విరాటుడు సర్వము సృష్టించినప్పుడు హిరణ్యగర్భుడు సర్వమును సంకల్పము చేతనే సృష్టించుకుంటాడు. ఏ పదార్థము చూచినా అది సంకల్ప సృష్టియే. దీనికి ఒక పదార్థముగాని లేక ఆధారముగాని వుండదు. స్వప్నములో దేనిని చూచినా యిది హిరణ్యగర్భుని సృష్టి. కనుక సూక్ష్మమైన హిరణ్యగర్భుడు యిది స్వప్నావస్థయందు సమస్త జగత్తును సృష్టిస్తూ వున్నాడు.

ఇంక మూడవది అవ్యాకృతుడు. అవ్యాకృతుడనగా ఎట్టి ఆకారములు లేనివాడు. ఇతను కారణ శరీరమునందు పరిపూర్ణమైన రూపరహితుడై సుషుప్తి స్థితిని అనుభవిస్తూ వుంటాడు. ఇతనికి ఎట్టి ఆకారము లేదు. ఆకారము లేదుగాని అన్నింటిని తాను స్వాధీనము చేసుకుంటున్నాడు. కరచరణాది అవయవములు లేవుగాని అన్ని పనులు చేస్తున్నాడు. అనేక దూరములు ప్రయాణము సల్పుతున్నాడు. నేత్రములు లేవుగాని అన్నింటిని చూస్తున్నాడు. శ్రోత్రములు లేవుగాని సర్వము వింటున్నాడు. కనుక సృష్టికి సంబంధించిన సమస్త కర్మలు ఆచరిస్తున్నాడు గాని ఆకారము లేదు. ఇతనినే అవ్యాకృతుడని పిలుస్తూ వచ్చారు. ఈ అవ్యాకృతునకు మరి రెండు పేర్లు కూడా వుంటున్నాయి. రెండవది అంతరాత్మ. మూడవది ఈశ్వరత్వము. విరాటుడు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతుడు అనే యీ ముగ్గురి యందు కూడను తిరిగి మూడు పేర్లు ఆవిర్భవిస్తున్నాయి

6310591105

ఈ అన్నింటి అంతరార్థము ఏమిటి? అంతరాత్మ అనగా తననుండి అన్నింటిని ప్రేరణ చేసేవాడు. ప్రతి ఒక్క ప్రేరణ అంతరాత్మనుండియే ప్రారంభిస్తున్నది. అంతర్వాణి. ఈ అంతర్వాణికి ఆధారభూతుడు అంతరాత్మనే. మానవునియందు ఆవిర్భవించే సమస్త శబ్దములు అంతరాత్మనుండియే ఆవిర్భవిస్తున్నాయి. కనుక సమస్త విధములైన శబ్దములకు అంతరాత్మనే మూలకారణము. ఇంక ఈశ్వరుడు. ఈశ్వరుడనగా ఏమిటి? ఇతను సకలైశ్వర్య స్వరూపుడని యు పేరు వుండినప్పటికి యీ పరిస్థితియందు తాను ఒక శిక్షా ప్రదాతగా వుంటాడు మంచి చెడ్డలను విచారణ సల్పి శిక్షను అందించేవాడే తాను. దీనినే లోకులు లయ కారకుడని పిలుస్తూ వచ్చారు. క్రియాశక్తి అతనియందు వుంటున్నది. ఆ క్రియాశక్తి చేతనే మానవుని మంచి చెడ్డలను నిర్ణయము చేసి తగిన ఫలము నందిస్తాడు. ఐశ్వర్యము నందించేవాడనగా ఏమిటి? మంచి చెడ్డ రెండూ ఐశ్వర్యములే. ఈశ్వరుడు సకలైశ్వర్యస్వరూపుడు కావటమే మానవుని యొక్క మంచి చెడ్డలను తాను నిర్ణయించి దానికి తగిన ఫలమును ఇస్తూ వుంటాడు.

ఉపనిషత్తులు కేవలము అర్థరహితమైనవిగాని లేక ఏదో ఒక యోగులకు గాని ఋషులకు మాత్రమే సంబంధించినదనిగాని మనము భావించరాదు. పవిత్రమైన ఉపనిషత్తులు యీనాటి విద్యార్థులు గుర్తించలేక పోవటానికి కారణం ఏమిటి? దానికి సరియైన అర్థములు ప్రబోధించి విద్యార్థులకు నిత్య జీవితములో అనుగుణమైన మార్గము కాదని ప్రవేశపెట్టటం లేకపోవుట చేతనే విద్యార్థులు దాన్ని గ్రహించలేకపోతున్నారు. ఏ భౌతిక విజ్ఞానము ఏవిధమైన మార్గములో దినదినాభివృద్ధి పొందుతున్నదో ఇవన్నియూ పూర్వము ఉపనిషత్తుల సారమే. ఈ ఉపనిషత్తులన్నీ వేదముల యొక్క అంత్యమే. వేదముల యొక్క అంత్యమగుట చేతనే వీటికి వేదాంతములని మరొక పేరు. ఇవి జ్ఞానమయమైనవి. జ్ఞానస్వరూపమైనవి. జ్ఞానప్రకాశమైనవి. ఇట్టి జ్ఞానమునే మానవుడు పొందాలి. భౌతిక లౌకికమైన జ్ఞానములు కేవలము యీ భౌతిక ప్రపంచమునకు మాత్రమే సంబంధించినది. మానసిక శాంతి, జీవిత సుఖము, ఆత్మానందము పొందవలెనన్న ఉపనిషత్తుల విషయాన్ని కొంతవరకు విచారణ చెయ్యాలి.

ఈ విరాట్టుడు, యీ హిరణ్యగర్భుడు యీ అవ్యాకృతుడు వేరే ఎక్కడో ప్రత్యేకంగా లేరు. వీటిని సూక్ష్మ రూపములో మనము విచారణ సల్పినప్పుడు ప్రతి మానవుడు విరాట్ స్వరూపుడే. ప్రతి మానవుడు హిరణ్యగర్భుడే.

ప్రతి మానవుడు అవ్యక్తుడే. ఇలా అల్పమైన మార్గంలో మనము ప్రవేశించటం చేత అనంతమైన తత్వాన్ని మనం అర్థము చేసుకోలేక పోతున్నాం.

శరీరము × infinity = అవ్యక్తలుడు

మైండ్ × infinity = హిరణ్యగర్భుడు

లైఫ్ × infinity = అవ్యక్తుడు.

ఈ మూడు స్థూల సూక్ష్మ కారణములతో చేరినటువంటివి. దేహమునకు సంబంధించినది విరాట్ స్వరూపము. మనస్సుకు సంబంధించినది హిరణ్యగర్భ స్వరూపము. జీవితమునకు సంబంధించినది అవ్యక్త స్వరూపము. ఈ మూడూ ఒకే మానవునిలో కూడినవే. హిరణ్యగర్భుడు ఎక్కడో వున్నాడని మనము విచారించకూడదు: హిరణ్యగర్భుడు మన స్థాయిలో వుంటున్నాడు. విరాట్స్వరూపుడు మన ఆకారములోనే వుంటున్నాడు. శబ్ద స్పర్శ రూప రస గంధాదులైన భూతములు కేవలము ప్రపంచములో వుంటున్నవి కాదు మన దేహము నందే వుంటున్నాయి. కనుక దేహము యొక్క ప్రతిబింబమే దేశము. Reflection of inner being is God. ప్రకృతి. మన దేహమే ప్రకృతి.

కొన్ని గ్రంథములలో దేహమును ప్రకృతి అని పిలుస్తారు. దేహమంతా మృణ్మయమే. ఇదే ప్రకృతి. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములే గాలి స్వరూపము. ఇదియే గాలి ఆకారము. ఇది పంచభూతములలో రెండవది. మూడవది అగ్ని. మనము కర్మాచరణలో ప్రవేశించినప్పుడు కదలిక జరిగినప్పుడు ఈ కదలిక చేతనే అగ్ని ప్రారంభమవుతుంది. ఒక చిన్న ఉదాహరణము. మనము ఏమైనా లాలూచీ చేసినామంటే ఒళ్లు వేడెక్కుతుంది. అంతవరకు పోనక్కరలేదు. రెండు చేతులు కొంచెం బిగ్గా రాపిడి జరిగిందంటే అక్కడ వేడి ప్రారంభమవుతుంది. కాబట్టి వేడి మన దేహమందే వుంటున్నది. అగ్ని మన దేహమునందే ఆవిర్భవిస్తున్నది. నీరు ఇక దేహము సర్వత్రా జల స్వరూపము. కొంచెం పరుగెత్తినామంటే sweat బయట చేరుతుంది. కాబట్టి ఈ జలమునకు మన దేహమే ఆధారము. ఇదే విధముగనే పంచభూతములు మన దేహమందే వుండటంచేత దీనినే విరాట్స్వరూపుడు అన్నారు. సమస్త శక్తులు మన దేహమునందే వుంటున్నాయి. మానవునిలో లేని వస్తులు బయట ప్రపంచములో మనకు కానరావు. కాని మానవుని దృష్టి బహిర్దృష్టినే ఆశించటంచేత బహిర్దృష్టిలో లేనివి తనలో లేవని భ్రమిస్తున్నాడు. తనయందున్న సమస్తమూ బహిర్దృష్టిలో మనము చూడగలుగుతున్నాము. రాగ భయ ద్వేషముల చేత మన స్వరూపాన్ని మనము మరచిపోతున్నాము. ఇది కేవలము

6310 59107

నిద్రావస్థయందు మనసు మనమే సాక్షి. నను నిద్రవచ్చింది. ఈ నిద్రలో నేను ట్రైన్ ఎక్కి పోతున్నావు. ఆ ప్రయాణము చేస్తుండే సమయములో అనేక స్టేషనులంతా వచ్చినాయి. అనేక మంది ప్యాసింజర్లునంతా చూశావు. ఇందులో ఎన్నిరకములైన పాటలోనో మాటలలోనో జీవితాన్ని గడుపుతూ వెళ్లావు. కాని యీ నిద్రావస్థలో యీ రైలు ఎక్కడనుండి వచ్చింది? నీ మనస్సు యొక్క కల్పితమే. యీ స్టేషన్లు ఎక్కడనుండి వచ్చాయి. ఈ మనస్సు యొక్క కల్పితమే. ఈ ప్యాసింజర్లు అంతా ఎక్కడనుండి వచ్చారు? ఇదంతా నీ మనస్సు యొక్క కల్పితమే. అన్నీ మనో కల్పితములో యీ స్వప్న దృశ్యములో అనుభవిస్తూ వచ్చాడు. ఇంతేకాదు. నిన్ను నీవు కల్పించుకొని సృష్టించుకున్నావు. ఇదే హిరణ్యగర్భ తత్వము. కనుక జాగ్రదవస్థయందు మనము అన్నియూ చూస్తూ వచ్చాము. కొన్ని కల్పితములలో దేశకాల పరిస్థితుల ప్రభావమునకు గురి అవుతాము. కాని స్వప్నావస్థలో దేశకాలపరిస్థితుల ప్రభావము ఏమి లేదు. జాగ్రత్తను, స్వప్నమునను వుండిన భేదాను మనము విచారించుకుందాము. నాలుగు గంటలకు యిక్కడ సమావేశము జరుగుతుంది అని విన్నాం. మూడున్నర గంటలకు నీవు సిటీలో బయలుదేరావు. అక్కడ కాలము మూడున్నరగంట. ఎట్లా నీవు బయలుదేరావు? కారులో బయలుదేరావు. ఇక్కడ చేరటము నాలుగుగంటలకు చేరావు. ఎందుకోసం చేరావు. సమావేశములో పాల్గొనటానికి చేరావు. సమావేశములో చేరటానికి కారణం ఏమిటి? స్వామి సంభాషణ వినాలని. కాలము మూడున్నర గంట. కార్యము కారులో బయలుదేరటము. కారణము స్వామి మాట వినాలని. కర్తవ్యము నాలుగు గంటలకు చేరటం. కాలకర్మకారణ కర్తవ్యములు వుంటున్నాయి జాగ్రత్తలో. స్వప్నములో నీవు ప్రయాణమై ఢిల్లీలో చేరిపోయావు. ఎప్పుడు ప్రయాణమైనావు. గం time. దేనిలో నీవు ప్రయాణమయ్యావు. కారణము లేదు. ఎందుకోసం. నీవు ఢిల్లీకి పోయావు. ఏమిటో కారణము తెలియదు. కర్తవ్యము ఏమిటి? ఇవి రెండు అర్థము కావు. కాలకర్మకారణ కర్తవ్యములు లేనిది స్వప్నము. కాలకర్మకారణ కర్తవ్యములతో కూడినది జాగ్రత్త. కనుకనే కాలకర్మ కారణ కర్తవ్యములతో కూడినది విరాట స్వరూపము. కాలకర్మ కారణ కర్తవ్యములు లేనిది హిరణ్యగర్భ స్వరూపము. ఈ రెండింటిని మనమే అనుభవిస్తున్నాము. అనుభవించేవాడు ఎవడు? జాగ్రత్తలో ఒకడు స్వప్నములో మరొకడు, సుషుప్తిలో మరొకడు కాదు. అవస్థలు వేరు వేరుగా వుండినాయిగాని వ్యక్తి ఒక్కడే. బాహ్యములో అనుభవించిన వ్యక్తి, స్వప్నములో అనుభవించిన వ్యక్తి, సుషుప్తిలో అనుభవించిన వ్యక్తి మూడూ ఒక్కడే. కాని మూడు అవస్థలుగా పురస్కరించుకోటంచేతనే వేరు వేరుగా

631059108

మనకు గోచరిస్తూ వచ్చును. కనుక దేశకాల పరిస్థితుల ప్రభావముతో మనకు యిన్ని బేధములకు కారణమవుతున్నాయి. దేశమంటే కాలముతో కర్మములతో, కర్తవ్యములతో కూడినది. కాలముతో కూడినదే కాయము. కర్మలతో చేరినదే కాయము. కనుక నీ కాయమును సార్ధకము చేసుకొనవలెనన్న పవిత్రమైన కర్మలు ఆచరించి కాలమును మనము సద్వినియోగము చేసుకోవాలి.

'కర్మాను బంధిని మనుష్య లోకే' ఈ మనుష్య లోకమంతా కర్మచేత కట్టబడింది. కర్మ చేయక ఏవ్యక్తీ క్షణమైనా వుండడానికి వీలులేదు. కర్మ అనగా కరచరణాది అవయవములతో చేసే పని అని అనుకుంటున్నాము. కాదు కాదు అన్నీ కర్మలే. ఒక చిన్న ఉదాహరణము. అతను ఏమి చేస్తున్నాడంటే ఏమీ చేయుటలేదు. ఏమీ చేయక ఏమి చేస్తున్నాడు? నిద్రిస్తున్నాడు. ఏమీ చేయక ఏమి చేస్తున్నావు? అని నిద్రిస్తున్నాడనేది ఒక కర్మ. ఏమీ చేయక ఏమి చేస్తున్నాడు? కూర్చున్నాడు. కూర్చోటం కర్మనే. యింకా సూక్ష్మంగా మనము విచారణ సల్పినప్పుడు మనము ఉచ్ఛ్వాస నిశ్వాసములు చేస్తున్నాం. ఇదంతా కర్మయొక్క ప్రభావమే. మన దేహము లోపల మనకు తెలియకుండా blood circulation జరుగుతున్నది. ఇదంతా కర్మనే. ఏ ప్రయత్నము లేకపోయినప్పటికిని మన గుండె కొట్టుకుంటూనే వుంది. ఇదంతా కర్మనే. ప్రయత్నముతో జరిగేవి కొన్ని అప్రయత్నంగా జరిగేవి కొన్ని. కొన్ని కర్మలను ప్రయత్న పూర్వకంగా ప్రవేశిస్తున్నాము. కొన్ని కర్మలు ప్రయత్నం లేక జరిగి పోతున్నాయి. నీవు మాటాడుతూ వుండు. నిదిస్తూ వుండు, జగడము వేస్తూ వుండు, శోకిస్తూ వుండు, ఆనందంగా నవ్వుతూ వుండు, ఏ పని చేస్తూ వుండినప్పటికి నీ శ్వాసము ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసములు కాసుకోటంలేదు. తమ పనులు తాము జరుపుతూనే వుంటున్నాయి. దీనికి ఏ ప్రయత్నం చేస్తున్నాడు మానవుడు. గుండె కొట్టుకోటానికి ఏమి ప్రయత్నం చేస్తున్నాడు మానవుడు. ఏ అవస్థయందు వుండినప్పటికి తన పని తాను చేస్తూనే వుంది. ఇదియే ఆధిదైవికమని పేరు. ఆధి భౌతికమని దేహముతో కూడినది. ఆధ్యాత్మికమని మనస్సుతో కూడినది. ఆధిదైవికము దివ్యశక్తితో చేరినటువంటిది. కనుక ఆధిభౌతికము, ఆధ్యాత్మికము, ఆధిదైవికము ఈ మూడింటి తత్వమే విరాట్స్వరూపుడు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతుడు. ఈ ముగ్గురు ఒక్కొక్క కాలమందు ఒక్కొక్క స్థితి అనుభవించి ఒక్కొక్క పేరుతో ఒక్కొక్క కర్మ ఆచరిస్తున్నారు. ఈ అన్నింటికి వుండిన అంతరార్థము అంతర్ రహస్యము గుర్తించిన వారు కనుకనే ఋషులందరు సర్వసంగపరిత్యాగులై నిజమైన ఆత్మానందము పొందుటకై ప్రయత్నిస్తూ వచ్చారు.

పెట్టిన పేర్లకు అర్థము తెలియక హాస్యాస్పదమైన జీవితము గడుపుతున్నారు. ఇప్పుడు వేదములో 'చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత' అని ఒక పాఠము వుంటున్నాది. చంద్రుడు వుంటున్నాడు. ఎవరో చంద్రుడు? మనము లౌకికమైన భౌతికమైన యాస్పెక్ట్సులో విచారణ చేసినప్పుడు చంద్రుడు అని ఒకడు వుంటున్నాడు. చంద్రమండలానికి వెళ్ళివస్తున్నారు. ఇక్కడ యేమి దేవుడు లేడు అని ఒకవిధమైన హాస్యాస్పదమునకు గురౌతున్నారు. చంద్రుడనగా కేవలము మనకు కనుపించే భూమిలోని చిన్నభాగము కాదు. చంద్రుడనగా మన మనోతత్త్వము. మన నేత్రములందు సూర్యతేజస్సు వుంటున్నది. ఈ సూర్య తేజస్సు వలనే అనేకత్వమైన దివ్యత్వాన్ని చూడగలుగుతున్నాం. దీని యొక్క ప్రభావము, దీని యొక్క పనిశక్తి ఇట్టిది అట్టిదని ఎవరు నిర్ణయించలేరు. ఒక అర ఇంచిలో వుండిన నేత్రమైనప్పటికి కోట్ల మైళ్ళదూరములో వుండిన నక్షత్రములను చూడగలుగుతున్నది. ఆశక్తి ఎక్కడనుండి వచ్చింది. నిజముగా ఆసూర్యశక్తి ఇందులో ప్రవేశించనట్లైతే ఇది ఆసూర్యునే ఎట్లు చూడగలుగుతుంది? ఇలా దీనికి reaction, resound, reflection వుంటున్నాది. ఈ సూర్యునకు నేత్రములకు వుండిన సంబంధము ఏమిటి? ఈ రెండింటి మోక్షము అనగా నెగటివ్, పోజిటివ్ చేరినట్లుగా అప్పుడే యీ దృశ్యమైన దీనినంతా చూడగలుగుతున్నారు. ఒట్టి negative వుంటే దానివల్ల ఫలితము లభించదు. ఒట్టి positive వుంటే ఏవిధమైన ఫలితము లభించదు. రెండింటి చేరిక జరగాలి. కన్నులున్నాయి కదా యని మనము చీకటింటిలోకి పోయి కన్నులు తెరుచుకుంటే ఏపదార్థము కనుపించదు. పోనీ లైటు వుందికదా అని కన్నులు మూసుకుంటే ఏపదార్థము కనుపించదు. ఆ లైటు యీ కన్నుల దృష్టి రెండూ చేరాలి. ఈ రెండింటి చేరిక చేత పదార్థము యొక్క స్వరూపము నిరూపిస్తూ వున్నాము. సూర్యకాంతి నేత్రకాంతి రెండింటి యొక్క చేరికనే జగత్ సృష్టి. కనుక సృష్టి అంతయూ మనకు ఎక్కడనుండి కనుపిస్తున్నది. దృష్టినుంచి కనుపిస్తున్నాది. దృష్టియే లేక సృష్టి లేదు. కనుక దృష్టి అత్యవసరమైనది. సృష్టిలో ఎట్టి దోషములు లేవు. అంతా దృష్టిలోనే వుంటుండాది. కనుక దృష్టిని మనము పవిత్రమైనదిగా వుంచుకోవాలి. దీనినే ఉపనిషత్తులు చక్కగా బోధిస్తూ వచ్చియి. నేత్రములో నీ శాస్త్రములు. నీ దృష్టియే యీ సృష్టి. ఈ రెండింటికి కలిగిన సంబంధ బాంధవ్యములు నీవు పెంచుకోమని బోధిస్తున్నాయి. కనుకనే ఏ భౌతిక శాస్త్రమునందు కూడను మనము తెలుసుకోలేని విషయాలను ఉపనిషత్తులద్వారా మనము ఎంతనో తెలుసుకోగల్గుతున్నాము.

ఈనాడు సైన్సు తెలుసుకున్నది చాలా తక్కువ. కాని అణుమాత్రమైన జ్ఞానాన్ని తెలుసుకొన్నామని అహంకార పడుతున్నారు ఈనాటి మానవులు. కాని అణువులోనే ఘనమున్నదని బోధిస్తున్నది ఆధ్యాత్మికము. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అణువులో అణువు మహత్తులో మహత్తుగా వుంటున్నది. చిన్నవిత్తనమును భూమిలో పెట్టి నాటినప్పుడు ఇది మహా పెద్ద మఱ్ఱి వృక్షంగా తయారై పోతున్నది. ఇంత పెద్ద వృక్షము ఎక్కడనుండి వచ్చింది. ఆ చిన్న విత్తనము నుండే వచ్చింది. ఆ చిన్న విత్తనములోనే కొమ్మలు రెమ్మలు, ఆకులు పువ్వులు అన్ని అందులోనే ఇమిడి వుంటున్నాయి. ఇతే ఎప్పుడు అవి బయటకు ఆవిర్భవిస్తున్నాయి. ఈ విత్తనము తన ఆకారమును శిథిలముగావించుకున్నప్పుడే ఆ వృక్షము బయలుకు వస్తున్నది. భూమిలో విత్తనము నాటినప్పుడు తనరూపమును తాను భస్మము చేసుకుంటుంది. అనగా అహంకారమును విసర్జిస్తుంది. తన ఆకారమును విసర్జిస్తుంది. అప్పుడే నూతనమైన ఆకారమును ధరిస్తుంది. తన ఆకారము ఆకారముగానే వుంటుంటే నూతన ఆకారమైన అనంతత్వము ఏమాత్రము మనకు అర్థము కాదు. ఇంత అనంతమైన వృక్షము నందు కూడను అణుమాత్రమైన విత్తనము వుంటున్నది. కనుక 'అణోరణీయాన్ మహతో మహీయాన్" అణువునుంచి అనంతము వస్తున్నది. అనంతమునుంచి అణువు వస్తున్నది. కనుక అనంతము అణువు ఈ రెండింటిని మనము విచారణ చేసినప్పుడు రెండూ ఒక్కటే. కాని దాని ఆకారము ఇది దాని ఆకారము అది. ఆకారవికారముల భేదమే కాని ప్రమాణము గాని పదార్థము ఒక్కటే ఇది ఉపనిషత్తుల ప్రధానమైన రహస్యము.

ఒక్కొక్క ఉపనిషత్తు కూడను సృష్టి యొక్క రహస్యాన్ని చక్కగా విపులము చేస్తూ వచ్చింది. అర్థము చేసుకొనేవారు ఒక్కొక్కరు వారివారి తెలివితేటలను పురస్కరించుకొని, మేధాశక్తిని పురస్కరించుకొని అర్థము చేసుకుంటూ వచ్చారు. అది వారి వారి ప్రాకృతమైన అభ్యాసములు పురస్కరించుకొని వస్తూ వుంటున్నది. ఇవి ప్రాకృతమైన వికారములు. ఒక మాంసాహారి అడవికి పోయి చెట్టుపై వున్న పక్షిని చూచినప్పుడు ఆహా! దీనిని నేను కొట్టితే ఇంటిలో అందరూ భుజించవచ్చును. అని దాని మాంసమును మాత్రమే దృష్టియందుంచుకుంటాడు. కాని ఒక కవి దానిని చూచినప్పుడు ఆహా! దీని యొక్క రంగులు ఎంత ఇదిగా వున్నాయి దీని ఈకలు ఎంత మృదువుగా వున్నాయి అని చక్కగా దాన్ని వర్ణిస్తూ వస్తాడు. పదార్థము ఒక్కటే అయినప్పటికి ఒక్కొక్కరి దృష్టి ఒక్కొక్కటిగా వుంటుంది. అదేవిధంగా ఈ దృష్టి దోషము ఎక్కడనుండి ప్రారంభమైంది. ప్రాకృతమైన అభ్యాస

ములనుండి ప్రారంభమైంది. కనుక మంచిని కూడను అభ్యాసము ద్వారానే పెంచుకోవాలి. కనుకనే

శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాధ్యానమ విశిష్యతే
ధ్యానాత్ కర్మ ఫలత్యాగ త్యాగశ్శాంతి రనంతరమ్.

ప్రతి దానికి అభ్యాసము అత్యవసరము. పుట్టిన బిడ్డ నడవవలెనంటే అభ్యాసము చెయ్యాలి. పుట్టిన బిడ్డ కొంతకాలమైన తరువాత భుజించవలెనంటే అభ్యాసము చెయాలి. పుట్టిన బిడ్డ మాట్లాడవలెనంటే అభ్యాసము చెయ్యాలి. walking, talking writing, reading యివన్నీ అభ్యాసము చేతనే వస్తున్నాయి. కనుక అభ్యాసము లేకుండా యేదానిని మనము సాధించలేము. కనుక యీ ఉపనిషత్తుల విషయాన్ని అభ్యాస రూపములో అనుసరించినప్పుడే దాని పవిత్రమైన స్వరూపాన్ని మనము సందర్శించగలము.

బ్రహ్మానందమనగా ఎక్కడనుంచి కొని తెచ్చేది కాదు. స్వస్వరూప చింతనే బ్రహ్మానందము. నేను ఎవరు అనే సత్యాన్ని గుర్తించుకోటమే బ్రహ్మానందము. మానవుడు తన దృష్టినంతా తనకంటె భిన్నమైన వస్తువు ఒకటి వున్నది, ఆ వస్తువును పొందినప్పుడే నేను ఆనందపడగలను అనే భ్రమనే యీ రాగానికి మూలకారణము వుతున్నది. ఈ రాగము నుంచి భయము ఏర్పడుతున్నది. ఎట్లా వస్తుందంటే భయము నేను ఆశించినది లభిస్తుందో లేదో, లభించినప్పటికి దానిని నేను పోషించుకోగలనో లేదో, దానిని దక్కించుకోగలనో లేదో భయము అక్కడ ప్రారంభమవుతుంది. భయము యొక్క వికారమే క్రోధము. కనుక రాగ భయ క్రోధములు ఒకదానినుండి ఒకటి ఆవిర్భవిస్తున్నాయి. రాగమే లేకపోతే ఈ క్రోధ భయములనే రోగము మనకు వుండదు కనుక రాగము చేతనే యివన్నీ ప్రారంభమవుతున్నాయి. ఏమిటి యీ రాగము. అదే వాంఛ. ఈనాటి వాంఛలు మితిమీరి పోతున్నాయి. ఈ మితిమీరి పోయిన వాంఛల వల్లనే మానవుని స్థితిగతులు తప్పుతున్నాయి. నేను ఏ విధంగా బ్రతకాలి? నేను ఎవరు అనే స్వరూపాన్ని కూడా మరచిపోతున్నాడు. నేను మానవుడనే దివ్యమైన తత్వము మరచిపోయి దానవుడుగా మారిపోతున్నాడు. మానవత్వమును మరచటం చేత చేసిన ఉపకారమును విస్మరిస్తున్నాడు. ఈ ఉపకారము లేకపోయినప్పుడు అపకారము చేస్తున్నాడు. కనుక ముఖ్యమైనది తన మానవత్వాన్ని తప్పక గుర్తించటానికి ప్రయత్నించాలి. దీనికి మానవతా విలువలు అత్యవసరము. మానవతా విలువలు యీనాడు కోల్పోవటం చేతనే యీ జగత్తులో యిన్ని క్రూరకృత్యములు, భయంకర చర్యలు జరుగుతూ వస్తున్నాయి. కేవలము దానవునిగా రూపొందుతున్నాడు.

తన అభీష్టములకు విరుద్ధముగా నడచినప్పుడు తల్లినైనా లెక్క చేయటం లేదు మానవుడు. కనుక తన desire ముఖ్యమని భావిస్తున్నాడు. కాదు కాదు. మానవత్వము ముఖ్యము. మానవత్వము ముఖ్యముగా వుండినప్పుడు అన్ని desires సహజంగానే తీరిపోతాయి. కేవలము మానవత్వము పోయిన తరువాత నీ వాంఛలు నెరవేరి యేమి ప్రయోజనము? ఈనాటి మానవులు అనేక వాంఛల చేత అనేక విధములుగా మంచి చెడ్డలను సంపాదన చేసుకుంటున్నారు. కాని మానవుడే లేక యీ సుఖదుఃఖములు ఎవరికి. గొప్పగొప్ప భవనాలు వుంటున్నాయి. బ్యాంకులో కావలసినంత balance వుంటున్నది. ఇంటిలో సుఖసంతోషములు, సదుపాయములు వుంటున్నాయి. కానీ వుండి ప్రయోజనమేమిటి? మానవత్వము లేకపోవటం చేత అన్ని కూడను నిరర్థకమై పోతున్నాయి. కనుక విద్యార్థులారా మొట్టమొదట మానవత్వాన్ని మనం అభివృద్ధి పరచుకోవాలి.

మానవుడు మానవుడుగా బ్రతకటానికి ప్రయత్నించాలి. సమాజములో గౌరవ ఆదర్శములను మనం పొందాలి. మనిషి మరణించినా ఆదర్శము మరణించేది కాదు. ఆదర్శ విద్యార్థిగా మీరు రూపొందాలి. ఎక్కడున్నా పోయినా మంచి కీర్తిని సంపాయించాలి. దీనివల్ల వస్తుందాది యీకీర్తి. కీర్తి అపకీర్తులకు మన నడతలే కారణము. కనుక మన నడతను అభివృద్ధి చేసుకోవాలి. పదిమంది మెచ్చినట్లుగా మనము నడుచుకోవాలి. పదిమంది నడుచటము నడచక పోవటము నీకు అక్కర లేదు. నీకు నచ్చినట్లుగా నీవు నడుచుకోవాలి. నీ conscience తృప్తి పడాలి. కానీ అది కూడా పడటంలేదు. కనుక నిన్ను నీవు ద్రోహం చేసుకుంటున్నావు. నిన్ను నీవు మోసం చేసుకుంటున్నావు. నీకు నీవే చెడు మార్గములో ప్రవేశిస్తున్నావు. కనుక నీకు నీవే దొంగగా రూపొందుతున్నావు. నీలో వుండిన దొంగను పట్టే యజమానుడు కావాలి.

విద్యార్థులారా! మీరు masters కావాలి గాని slaves కాకూడదు ఇంద్రియములను నిగ్రహించుకొని దుఃఖము, విచారము, కష్టము అనే వాటిని భరించుకొని మనస్సుకు సరియైన ధైర్యసాహసాలు అందించాలి. ఇట్టి గ్లూకోజ యింజక్షను, క్యాల్షియం యింజక్షను ఒక్క ఉపనిషత్తుల ద్వారానే మనకు లభ్యమవుతుంది. ఇది ఉపనిషత్తు లేదనికి సరియైన అర్థము. ఉపసమము నందే వుంటున్నది సర్వసారము ఉప-సమీపములో వుంటున్నది. ఆ సమీపములో వుండినప్పుడు దాని యొక్క విలువలన్ని మనకు లభ్యమవుతాయి. ఒక చిన్న ఉదాహరణము. ఒక airconditioned room లో air conditioner సమీపములో నీవు కూర్చుంటే

దానినుండి వచ్చిన చల్లనిగాలి నన్ను తగిలి నీలో వుండిన వేడి దూరమైపోతుంది. ఇంకెక్కడైనా Hill stations కి నీవు పోయినప్పుడు heaters పెట్టుకుంటాము. heaters కి ముందుగా నీవు కూర్చుంటే చల్లదనము దూరమవుతుంది. ఆ heater నిన్ను హాయినిస్తుంది. అదే విధముగా దైవమును సమీపంగా వస్తే నీ దుర్గుణములు పోతాయి. దైవము యొక్క సద్గుణములు అలవడతాయి. దాని సుగుణములు నీకు వస్తాయి నీ దుర్గుణములు పోతాయి. కనుక ఉప-సమీపము. ని-క్రింద. షత్ కూర్చో. నీవు దాని సమీపములో పోయి కూర్చో దాని యొక్క సద్గుణములు నకు అలవాటు అవుతాయి. ఇదే ఉపనిషత్తు యొక్క నిజమైన అర్థము. ఉపనిషత్తులంటే కొన్నమంది కొన్ని కథలు ఋషులు వ్రాసిన తత్వములని అలక్ష్యము చేస్తున్నారు.

విద్యార్థులారా! పిచ్చిపిచ్చి కథలను శ్రద్ధాభక్తులతో చదువుతూ వుంటారు. కానీ ఈ ఉపనిషత్తులు చదివి కొంతవరకు దీనిలో వున్న దానిని అర్థము చేసుకోటానికి ప్రయత్నించరాదా. చాలామంది పిల్లలు ట్రైన్ లో ట్రావెల్ చేస్తుంటే అక్కడ కూడా ఈ నవల్సు వుండాలి. అవి వుంటే స్టేషను వచ్చిందా లేదా అనేది వారికి తెలియదు. అన్నీ మరచిపోయి పోతుంటారు. ఇంకా ఈ కలిప్రభావము చేత ఈ టెలివిజన్లు, వీడియోలు ఇవన్నీ వస్తున్నాయి. ఈ holidays లోపల ఇండ్లకు పోయినప్పుడు ఈ పిల్లలు భోజనాలు కూడను వీడియోల ముందరే. వీడియో చూస్తూ భోజనం చేయాలి. కనుక ఎలాంటి food నో అలాంటి head అవుతుంది. దాన్ని చూస్తూ చూస్తూ ఆ Thoughts నీ ఆహారము లో ప్రవేశిస్తాయి. కనుక food ని బట్టి head, head ను బట్టి God. చూడండి మంచివి. తప్పులేదు. కానీ ఈ పవిత్రమైనవి, దివ్యమార్గాన్ని అందించేవి ఎందుకు నీవు చదవకూడదు. పవిత్రమైన చరిత్రలు చదవాలంటే తలనొప్పి వస్తుంది. పిచ్చిపిచ్చి కథలు చదవాలంటే కాలమే వారికి కనుపించదు. ఇది కలి ప్రభావము. కానీ మన విద్యార్థులు అలాంటి వారు కారు. కనుక మీరు అప్పుడప్పుడు ఈ పవిత్రమైన సత్సంగము లో ప్రవేశించి ఉపనిషత్తులు, బైబుల్, ఖురాను, ఇతిహాసము, గ్రంథరాజము ఇలాంటి సద్గ్రంథములు చదవండి తప్పు లేదు. ఈ సర్వగ్రంథములందు పవిత్రమైన భావములు పవిత్రమైన ఆశయములు వుంటున్నాయి. ఇలాంటి పవిత్ర గ్రంథములు నేడు చదవటం లేదు కనుకనే పవిత్ర భావములు మనలో నుంచి రావటం లేదు.

ఆడవారు కూడను అంతే. వారు పవిత్రమైన గ్రంథాలంతా చదవాలి. పవిత్రమైన దృశ్యాలంతా చూడాలి. వారు గర్భంగా వుండినప్పుడు మూడు సినిమాలు నాలుగు సినిమాలు చూస్తూ వుంటారు. కనుక వారికి పుట్టే పిల్లలు సినిమా పిల్లలు పుడుతున్నారు. కారణం ఏమిటి? మన భారత దేశ చరిత్రలో మరల గుర్తించండి.

సుభద్ర గర్భంగా వున్నప్పుడు అర్జునుడు పద్మవ్యూహమును గురించి చెబుతూ వచ్చాడు. సుభద్రకు. కాని సుభద్ర మైమరచింది. లోపల వున్న అభిమన్యుడు యీ పద్మవ్యూహాన్ని విన్నాడు. లీలావతి గర్భంగా వున్నప్పుడు నారదుడు వచ్చి పవిత్రమైన బ్రహ్మభావాన్ని గురించి బోధించాడు. అవంలా ప్రహ్లాదుడు చక్కగా విన్నాడు. గర్భములో వున్న శిశువునకు యీ విధమైన భావములు అన్ని చేరిపోతున్నాయి. తల్లికి బిడ్డకు ఒకే సంబంధము. ఒకే ఆహారము. కనుక తల్లి తగిన శ్రద్ధను బూని పవిత్రమైన పలుకులు, పవిత్రమైన దృశ్యములు, పవిత్ర శ్రవణములు చేయటానికి తగిన శ్రద్ధను అలవరచుకోవాలి. ఇంకా పిల్లలు చెడిపోవటానికి మూలకారణము. ఆడువారికి ఒక విషయం చెప్పాలి. ఈనాటి విద్యాభివృద్ధి వల్ల, అప్లైన్సు టెక్నాలజీ వల్ల అన్ని మనుషులు చేయవలసిన పనులు మిషన్లే చేస్తున్నాయి. ఒక కుక్కరు పెడ్తారు. దాంట్లో సాంబారు, అన్నము అన్ని దాంట్లోనే అయిపోతాయి. ఇంక ఏమీ వారు శ్రమ పడనక్కరలేదు. కాని తమ పిల్లలను తాము చూచుకోటంలేదు. పిల్లలు పుట్టేటప్పటికి తాము వుద్యోగములోనో యింకో విధమైన బిజినెస్ లో వుండి తాను ఆఫీసుకు వెళ్ళిపోతుంటాది. ఆ పిల్లలను ఆయాకు అప్పచెప్తూ తుంది. ఈ ఆయా యొక్క ప్రేమసంబంధమైన విషయాలంతా యీ బిడ్డ అనుసరిస్తాడు క్రమక్రమేణా పెద్దగా అయిపోతాడు. తల్లి యొక్క సంబంధ బాంధవ్యమే వుండదు యింక. తల్లి యొక్క స్పర్శ తల్లి యొక్క సంభాషణ, తల్లి యొక్క దృష్టి ఆ బిడ్డపైన వుంటుండాలి. కనుకనే పూర్వకాలమందు 24 గంటలు చిన్న బిడ్డను తల్లియే పోషించేది. తల్లియే స్నానము చేయించేది. తల్లియే పాలిచ్చేది. తల్లియే నిద్రపుచ్చేది. తల్లియొ దగ్గర పండపెట్టుకునేది. ఈ విధమైన దర్శన స్పర్శన సంభాషణాలు తల్లితోనే కూడి వుండేటువంటిది. ఈ ఆధునిక యుగములోపల ఏమైపోతున్నాది. కనటము మాత్రమే తన వంతు. పోషించటమంతా ఆయా వంతు. నర్సు వంతు. ఈ నర్సులతో బాచ్ కో పబ్లిక్ పార్కులకో పంపిస్తూ వుంటారు పిల్లలను. వారు కార్లో పంపించినప్పుడు అక్కడ డ్రైవరు ఆయా మాట్లాడే విషయాలు అంతా వీడు వింటాడు. ఆవనాలుతో వీనికి అలవడిపోతాయి. ఈ ఆయా ప్రాక్టీసులే వీనికి వస్తాయి. కడపటికి ఆయా చస్తే ఏడుస్తాడు గాని అమ్మ చస్తే ఏడవడు. కారణం ఏమిటి? అమ్మతో సంబంధము లేదు. అందుకని దుఃఖము ఎట్లా వస్తుంది. ఈ విధంగా కలి యొక్క ప్రభావము తల్లి పిల్లలను వేరుచేస్తున్నది.

భారతీయ సంస్కృతి ప్రాచీన కాలము నుండి యింత పవిత్రమైన స్థితిలో పోషించుకుంటూ వచ్చింది. ఈ పవిత్రమైన సంస్కృతిని మనము చక్కగా అర్థము చేసుకోవాలి. ఏదో యీ వంతా అనాగరికమైన చర్యలని భావిస్తున్నాము.

కాదు. కాదు. రేపటి దినము మాతృ రూపులుగా తయారయ్యే విద్యార్థినులు వుంటున్నారు కనుక మీరు ఈ విషయములనంతా జాగ్రత్త పెట్టుకొని మీ పిల్లలను సరియైన స్థితిలో పోషించి, సరియైన స్థితిలో వారిని అభివృద్ధిపరచి ఆదర్శ పుత్రులుగా తయారు చెయ్యాలి. మదాలస వుండేటువంటిది. ఆమె పుట్టిన పిల్లవానికి అంతా పవిత్రమైన భగవత్ చింతన బోధిస్తూ వచ్చేది. ఆ పిల్లను ఊయలలో వూపుతూ

ఓంకారమనియేటి ఒక తొట్టెలోను
తత్వమసి అనియేటి పరుపు లోపరచి
ఎరుకనే బాలుని ఏమరక వుంచి
ఏడు జగముల వారు ఏకమై వూచ. జోలి॥

ఈ విధంగా ఆమె పాడేది. ఏడు జగములవారు అనగా సూర్యరశ్మితో తూగినవారంతా నిన్ను ఆశీర్వదిస్తూ వుంటారు. అప్పుడే నీ ప్రజ్ఞానమనేది వికసిస్తుంది. ఓ కుమారుడా నీవు నిరంతరము ఒక దివ్య భావాన్ని కలిగి వుంటుండు. ఈ లోకము కోసము నీవు ఏమాత్రమూ వెరువవద్దు. ఈ దివ్యత్వాన్ని నీవు పొందు అని ఆశీర్వదిస్తూ ఆమె జోలపాట పాడేటువంటిది. ఈనాడు మనం కోరేది అది కాదు. నీవు గొప్ప పుణ్యవంతుడు కావాలి. గొప్ప విద్వాంసుడు కావాలి. ఫారెన్‌గా పోవాలి. డబ్బును సంపాయించాలి. ఇలాంటి భావముతో వారు వూపుతూ వుంటారు. ఒక చిన్న పాట కూడా వుంటున్నది.

చెల్లోన మీ మామ శనగ తెయ్యంగో
భాగమిమ్మని పోమ్మా బాల శంకరుడా
ఏసినాడూ లేవు కోసినాడూ లేవు
ఏందిస్తర భాగంబు నీకు
అంటే. మాయమ్మ నీతోడ పుట్టినది కాదా
తగవుకొపోదాము ధర్మ చావడికి
అన్నాడట ఈ పిల్లవాడు. అప్పుడే యుద్ధము ప్రారంభము.
ధర్మచావడిలోని పెద్దలందరు
భాగమును ఇమ్మనిరి బిడ్డనిమ్మనిరి.

ఇదే పోషణ. ఇలాంటి భావాలతో బిడ్డలను పోషిస్తున్నారు. పుట్టిన వెంటనే పెండ్లి మేనమామ పిల్లనిచ్చి పెళ్లి చేస్తాం. లక్షాధికారి బిడ్డనిచ్చి పెండ్లి చేస్తాము. పెండ్లి చేస్తే మంచి కానుకలు వస్తాయి. వరకట్నం వస్తుంది. దాని ద్వారా మనం మిద్దె కట్టుకోవచ్చు. అనే ఆశలు ఈనాటి తల్లులకు. ఈ చిన్న పిల్లలకు చిన్నతనము నుండి ఇలాంటి బోధలు చేస్తున్నాం.

631059116

ఐదు సంవత్సరములు వచ్చేటప్పటికి అక్షరాభ్యాసము ప్రారంభించే సాంప్రదాయము భారతీయులది. ఓం నమఃశివాయ అనే అక్షరములు ఏమైపోతున్నాయి. ఓం ప్రత్యక్షమై పోతుంది. నమశ్శివాయ అయిపోతుంది. ఓం నమశ్శివాయ అయిపోయింది. ప్రారంభములోపల భగవన్నామము చేతనే అక్షరాలు నేర్పించేవారు. ఈనాటి పిల్లలకు Baba Black sheep. చూడండి. ding dong bell pussy is in the well. అర్థము లేనివి పిల్లలకు బోధిస్తూ వున్నారు. ఈనాటి పిల్లలందరు ఈ మార్గము పట్టటంలో వారి తప్పు లేదు. తల్లితండ్రుల తప్పు. తల్లితండ్రులు ఈ విధంగా పెంచుతూ వస్తున్నారు. మొక్క చక్కగా అయినప్పుడు చెట్టు చక్కగా అవుతుంది. ఈ మొక్క సొట్ట అయితే చెట్టంతా సొట్టనే అవుతుంది. కనుక ఈనాటి పిల్లలను చక్కని ఆదర్శమైన జీవితంగా పోషించటానికి తల్లులు తగిన శ్రద్ధ వహించాలి. ఇవన్నీ కేవలము భారతీయ సంస్కృతి యైన ఈ పవిత్రమైన ఉపనిషత్తులు, పురాణముల యొక్క ప్రమాణాన్ని కొంతవరకు విచారణ చెయ్యాలి. ఇవన్నీ ఎక్కడనో వుండిన విషయములు చెప్పటం లేదు, అంతా మనయందే వుండిన విషయములు తెలుపుతున్నాను. ప్రతి శక్తి, ప్రతి గుణము, ప్రతి పవిత్రము మానవుని యందే వుంటున్నది గాని బయట లేదు. కనుక ఆదివ్యమైన భావాలు ఆవిర్భవింపచేసుకోటానికి తగిన కృషి చేయండి.